Crime Mirror QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ ద మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
26-11-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 16

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## కొన్ని వర్గాలకే భూ కేటాయింపా?

**అది రాజ్యాంగ వ్యతిరేకమే.. స్పష్టం చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం**

**న్యాయమూర్తులు, అధికారులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను**

**కేటాయిస్తూ సర్కారు ఇచ్చిన జీవోల రద్దు వారు కట్టిన సొమ్ము వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశం**



న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రజా ప్రతినిధులు, అఖిల భారత సర్వీసు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు, జర్నలిస్టులను ప్రత్యేక వర్గంగా భావిస్తూ ఇళ్ల స్థలాల కోసం భూమి కేటాయించడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఈ వర్గీకరణకు వీలు కల్పించిన 2005 నాటి జీవో(243, 244)లనే కాక, భూమి కేటాయించేందుకు 2008లో జారీ చేసిన జీవోలు 419, 420, 422 నుంచి 425లను కూడా రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం అంతిమ తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని 14వ అధికరణ కింద సమానత్వ హక్కును ఈ కేటాయింపులు ఉల్లంఘించాయని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు నేపథ్యంలో భూమి కేటాయింపులకోసం ఏర్పడిన సహకార సంఘాలు,

మిగతా 2లో

## అదానీ నిధులు వద్దన్నాం



**నేనేదో అప్పనంగా తీసుకున్నాననే చర్చ జరగడం ఇష్టం లేదు: సీఎం రేవంత్‌రెడ్డి**

**రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని అదానీ సంస్థకు లేఖ రాశాం**

**నిధులు వద్దన్నంత మాత్రాన పాత ఒప్పందాల రద్దు సులువు కాదు**

**అసలు పెట్టుబడుల విషయంలో బీఆర్ఎస్ విధానమేంటి?**

**గతంలో వారు అదానీతో ఒప్పందాలు చేసుకున్నందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా?.. వాళ్లది కడుపు మంట, కాకిగోల..**

**వాళ్లు అరుస్తుంటే మాకు ఉత్సాహం వస్తుంది**

**ఢిల్లీ వెళ్లేది బీఆర్ఎస్ వాళ్లలా పైరవీల కోసం కాదు..**

**రాష్ట్రానికి నిధుల కోసం వెళ్తున్నా.. మహారాష్ట్ర ఫలితాలపై కిషన్‌రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మండిపాటు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని

మిగతా 2లో

## 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి..?



**అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించే ప్లాన్!**

**ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..?**

**అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలి**

**మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్**

## అన్న.. అదానీ.. అల్లుడు.. తమ్ముడు!

### ఆ నలుగురి కోసమే రేవంత్

- వీళ్లపైనే రేవంత్ ధ్యాస.. వాళ్ల ప్రయోజనాల కోసమే పనులు
- ముఖ్యమంత్రి పనిచేసేది పేద ప్రజల కోసం కాదు
- మహాలక్ష్మి అన్నడు.. మహారాష్ట్రలో తన్నులు తిన్నడు
- లగచర్లకు అధికారులు పోతే నిరసన తెలిపిండ్రు
- సీఎం రేవంత్‌రెడ్డి పోతే ఉరికించి కొట్టుడు ఖాయం
- ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములూ గుంజుకుంటున్నరు
- కాంగ్రెస్ గిరిజన ఎమ్మెల్యేలు రాళ్ల దాడి చేస్తరట!
- ఇది కేసీఆర్ దళం, ఎవరికీ భయపడేది లేదు
- మానుకోట గిరిజన మహాధర్నాలో కేటీఆర్

మిగతా 2లో





## టూరిజం హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- రాష్ట్రంలో పర్యాటకానికి అద్భుత అవకాశాలు
- ఏటా పది శాతం వృద్ధికి చాన్స్
- ఎకో టూరిజానికి ప్రత్యేక కార్పొరేషన్
- ఆలయాల పవిత్రతను కాపాడేందుకు చర్యలు
- డ్రెస్‌కోడ్‌పై భక్తులకు అవగాహన కల్పించాలి
- హెరిటేజ్ ప్రాంతాలను గత పాలకులు తవ్వేశారు
- వాటిని గుర్తించి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది
- రాష్ట్రంలో పర్యాటకుల భద్రత చాలా ముఖ్యం

అమరావతి, నవంబరు 25 : రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, ఏపీని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని చెప్పారు. ఏటా పది శాతం అభివృద్ధికి అవకాశం ఉన్న పర్యాటక రంగాన్ని సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక రంగ

(మిగతా 2వ పేజీలో)

## పీఠికకు బాసట

**సామ్య, లౌకిక వాదాల చేర్పు సరైనదే.. అవతారికను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది.. విచారణ అనవసరం.. సామ్యవాదం అంటే సమానత్వం**

**మతంలోని లోపాల నివారణ కూడా లౌకిక వాదంలో భాగం.. సుప్రీం వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, నవంబరు 25: దేశంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్న తరుణంలో సుప్రీంకోర్టు సోమవారం 'పీఠిక'కు సంబంధించి కీలక తీర్పును వెలువరించింది. 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన అంశాలకు ఆమోదం తెలిపింది. రాజ్యాంగం అవతారికలో 'సామ్యవాదం', 'లౌకికవాదం', 'సమగ్రత' అన్న పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ అంశంపై విచారణ జరపాల్సిన పనిలేదని విస్పష్టంగా తెలిపింది. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, అత్యయిక పరిస్థితి అమల్లో ఉన్న సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో ఈ పదాలను అదనంగా చేర్చారు. దీన్ని సవాలు చేస్తూ తొలిసారిగా 2020లో బలరాం సింగ్ అనే వ్యక్తి న్యాయవాది విష్ణు కుమార్ జైన్ ద్వారా పిటిషన్ వేశారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, న్యాయవాది, బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పును వాయిదా వేసింది. సోమవారం సీజేఐ జస్టిస్ ఖన్నా తీర్పును వెలువరిస్తూ "ఈ విషయమై మరింత లోతుగా విచారణలు, తీర్పులు అవసరం లేదు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారం పీఠికకు కూడా వర్తిస్తుంది" అంటూ స్పష్టత ఇచ్చారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీ సవరణలు చేసేందుకు అడ్డంకి కాబోదని ధర్మాసనం తెలిపింది. ఆ తేదీ సవరణలు చేసేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారాలను తగ్గించలేదని పేర్కొంది. ఆర్టికల్ 368 ప్రకారం

(మిగతా 2వ పేజీలో)

# టూరిజం హబ్‌గా ఆంధ్రప్రదేశ్

అభివృద్ధికి కీలక నిర్ణయాల తీసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కార్యాచరణ, పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలుపై సహచర మంత్రులు, అధికారులతో పవన్ కల్యాణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలి. కర్నూలు జిల్లా ఆదోని, దొండపాడు, ఉమ్మడి కడప జిల్లా సిద్ధవటం లాంటి ప్రాంతాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఎకో టూరిజానికి సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాం" అన్నారు.

### రాష్ట్రంలో అడ్వెంచర్ థీమ్ పార్కులు

"కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్‌లు ఏర్పాటు చేశారు. అలాంటి థీమ్ పార్క్‌లు మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. నంద్యాలలో ఏనుగుల క్యాంపులు ఉన్నాయి. గండికోట, హార్స్‌లీహిల్స్‌ల్లో అద్భుతమైన కొండ ప్రాంతాలున్నాయి. సినిమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు సులువుగా ప్రచారం కల్పించవచ్చు. ఒక సినిమాలో ఒక స్పాట్‌ను ప్రమోట్ చేస్తే అదే కరపత్రంగా మారుతుంది. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లినపుడు ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తుల ప్రస్తావన తెచ్చారు. వారికి గతంలో ఉండే సౌకర్యాలు ప్రస్తుతం తీసేశారని ఆయన చెప్పారు. సీఎంతో సమావేశం సందర్భంగా అటవీశాఖ అధికారులు మా దృష్టికి తెచ్చిన టూరిజం పోలీసింగ్ అంశం కూడా చర్చకు వచ్చింది. మన దగ్గర దేవాలయాలు అంటే పిక్నిక్ స్పాట్స్‌లా మారిపోయాయి. ఆలయాల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకోవాలి. ఆలయ ప్రాంగణాల్లో క్రమశిక్షణ, డ్రెస్‌కోడ్ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. హెరిటేజ్ ప్రాంతాలను గత పాలకులు తమ స్వార్థానికి తవ్వేశారు. వాటిని గుర్తించి, కాపాడుకోవాలి. ముఖ్యంగా పర్యాటకుల భద్రత చాలా అవసరం" అని పవన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ కమిషన్ ఎస్.సత్యనారాయణ, పర్యాటక శాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పీఠికకు బాసట

రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని తెలిపింది. రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న ఆమోదించగా అనంతరం ఎప్పుడో 1976లో పీఠికను సవరించి 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాలను ఎలా చేర్చుతారంటూ సుబ్రహ్మణ్య స్వామి ప్రశ్నించారు. అలా చేర్చడం ద్వారా మొదటి నుంచే ఈ భావనలు అమల్లో ఉన్నట్టైందని అభ్యంతరం చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పష్టతనిస్తూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తేదీ సవరణలకు అడ్డంకి కాబోదని తెలిపింది. "రాజ్యాంగ సవరణకు 368 అధికరణం ద్వారా పార్లమెంటుకు సంక్రమించిన అధికారం నిర్వివాదమైనది. ఆ అధికారాన్ని ఇప్పుడు సవాలు చేయలేదు" అని పేర్కొంది.

### సమానత్వ భావనకు మరో రూపం

పిటిషనర్లు ప్రధానంగా అభ్యంతరం తెలిపిన 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాల చేర్పుపై ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఇది రాజ్యాంగం మౌలిక సూత్రమైన 'సమానత్వం' అన్న భావనను మరో రూపంలో చెప్పడమేనని స్పష్టం చేసింది. పీఠికలో 'లౌకిక వాదం' అన్న పదాన్ని ఎందుకు చేర్చాల్సి వచ్చిందన్న దానిపై జస్టిస్ ఖన్నా వివరణ ఇస్తూ.. "సమానత్వానికి, ప్రజా ప్రయోజనానికి అడ్డంకులు కలిగించేలా మత విశ్వాసాలు ఉంటే అందులో రాజ్యం జోక్యం చేసుకుంటుంది. ఈ స్పష్టత కోసమే పీఠికలో 'సెక్యులర్' అన్న పదాన్ని పొందుపరిచారు" అని వివరించారు. లౌకికవాద భావనను దేశ పరిస్థితులకు అనుగుణంగానే అర్థం చేసుకోవాలన్నారు.

# కొన్ని వర్గాలకే భూ కేటాయింపా?

వాటి సభ్యులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము సహా డిపాజిట్ చేసిన మొత్తం డబ్బునూ తిరిగి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ మొత్తంపై ఏ మేరకు వడ్డీ చెల్లించాలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించాలని, అయితే ఆ మొత్తం ఎప్పటికప్పుడు రిజర్వు బ్యాంకు నిర్ణయించే వడ్డీ రేట్లకు మించరాదని తేల్చింది. సహకార సంఘాలు, వాటి సభ్యులతో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న లీజు ఒప్పందాలు కూడా రద్దయినట్లేనని ప్రకటించింది. సహకార సంఘాలు, సభ్యులు చెల్లించిన డెవల్‌పమెంట్ చార్జీలు, ఖర్చులను కూడా ఆదాయ పన్ను రిటర్నుల్లో సర్దిపై చేసిన తర్వాత తిరిగి చెల్లించాలని తమ తీర్పులో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం తాము వెనక్కు తీసుకున్న భూమిని ఏమి చేయాలో నిర్ణయించుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. భూకేటాయింపులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం, సహకార సంఘాలు, వాటి సభ్యులు దాఖలు చేసుకున్న అన్ని పిటిషన్లనూ సుప్రీంకోర్టు త్రోసిపుచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ వర్గాలకు చెందిన వారికి భూకేటాయింపులపై కొన్ని విధివిధానాలను నిర్ణయిస్తూ 2010లో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వివిధ వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు ఈ అంతిమ తీర్పు వెలువరించింది. తెలంగాణలో ప్రజావనరులను పంపిణీ చేయడంలో ప్రభుత్వ దాతృత్వ వైఖరిని వివక్షగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఇది పౌరులు, వారి హక్కులు, ప్రజాస్వామ్య పనితీరుపై చెప్పుకోదగిన ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించింది. ఒక ప్రైవేట్ వ్యక్తి మాదిరి తన ఇష్టం వచ్చిన నిబంధనలను ఏర్పరచుకుని.. ఇష్టం వచ్చిన వారితో ఒప్పందం కుదుర్చుకుని వనరులను పంపిణీ చేసేందుకు ఒక ప్రభుత్వానికి అధికారాలున్నాయా అనే ప్రశ్నపై సుప్రీం దృష్టి సారించింది. అలా చేయడానికి వీల్లేదని చెప్పేందుకు పలు తీర్పులను ఉటంకించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం ప్రజల ఆస్తులను, వనరులను పంపిణీ చేసే అధికారం తిరుగులేనిది కాదని, ఏ కేటాయింపులైనా ఆర్టికల్ 14ను దృష్టిలో ఉంచుకునే జరగాలని స్పష్టం చేసింది. ఆ లెక్కన చూస్తే ప్రభుత్వం జారీ చేసిన జీవోలేవీ రాజ్యాంగబద్ధంగా లేవని తేల్చింది. అమెరికా, బ్రిటన్, కెనడా, దక్షిణాఫ్రికా దేశాల్లో కూడా కోర్టులు ఈ విషయంలో తీసుకున్న నిర్ణయాలను గుర్తు చేసింది. భూములు కేటాయించేందుకు ఏ వర్గీకరణ చేసినా అది పక్షపాతంతో చేయరాదని, హేతుబద్ధంగా ఉండాలని చెప్పింది. అణగారిన వర్గాలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలతో పోలిస్తే న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మెరుగైన స్థితిలోనే ఉన్నారని తెలిపింది.

### సామాన్యుడికి నష్టం..

తమ ఇష్టం వచ్చిన వారికి విలువైన వనరులను అక్రమంగా పంపిణీ చేయడం సరికాదని ధర్మాసనం పేర్కొంది. విస్తృత సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా వనరులను కేటాయించాలని, చట్టసభలు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ప్రజలకు ట్రస్టీలుగా వ్యవహరించాలని హితవు పలికింది. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, జర్నలిస్టులను ప్రత్యేక కేటగిరీలుగా భావించి భూమిని తక్కువ

# 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి..?



(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పై మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు స్పందించారు.స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని , ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# అదానీ నిధులు వద్దన్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరఫున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగ వద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతు న్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి.. రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు.అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి.. బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా.. ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అదానీ సంస్థపై లంచాల విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై విధంగా స్పందించారు. అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌నకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు' అని సీఎం అన్నారు.

# అన్న.. అదానీ.. అల్లుడు.. తమ్ముడు!

వరంగల్, నవంబర్ 25 : పేదలు, రైతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేయడంలేదని.. సొంత అన్న, అదానీ, సొంత అల్లుడు, సొంత తమ్ముడి కోసమే పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఫార్మా విలేజీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి సొంత అల్లుడి ఫార్మా దుకాణం కోసం పేద రైతుల భూములను గుంజుకుంటున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో కూర్చొని మరో పది రోజులైతే ఏడాదవుతుందని, అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. గ్యారెంటీల అమలులో విఫలమైనందుకు రాష్ట్ర ప్రజలకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు వచ్చేదని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత రైతు బంధు ఎగ్గొటిండని, రైతు బీమా బంధు పెట్టిండని, వడ్లకు బోనస్ బోగస్ అయ్యిందని మండిపడ్డారు. మహాలక్ష్మీ పథకం పేరు చెప్పి రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో తన్నులు తిన్నాడని ఎద్దేవాచేశారు. తెలంగాణలో ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇస్తున్నామని మహారాష్ట్రలో అబద్ధం చెప్పినందుకు అక్కడి ఆడబిడ్డలు గట్టిగా బుద్ధి చెప్పారని దెప్పిపొడిచారు. 'తెలంగాణ ఆడబిడ్డలను మోసం చేసిండు.. మమ్మల్ని కూడా మోసం చేయడానికే వచ్చిండు అని మహారాష్ట్ర ఆడబిడ్డలు ముందే గమనించిండ్రు.. అందుకే చైతన్యంతో కాంగ్రెస్‌ను తన్ని తరిమికొట్టిండ్రు' అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోకవర్గం కొడంగల్‌లోని లగచర్ల గిరిజన, దళిత, పేద రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండకు నిరసనగా మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన గిరిజన మహాధర్నాలో కేటీఆర్ ప్రసంగించారు. '14 ఏండ్ల కిందట ఇదే మానుకోట ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ఒక పెద్ద మలుపునకు కారణమైంది. మానుకోట రాళ్ల మహత్యమేమిటో తెలంగాణను అడ్డుకున్న ప్రతి ఒక్కడికీ తెలుసు' అని హెచ్చరించారు. 'ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములను గుంజుకుంటం.. ఏం చేసుకుంటారో చేసుకోండి అని నియంతలా విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మానుకోట మహాధర్నాకు పెద్దఎత్తున గిరిజనులు, పేద రైతులు తరలివచ్చింర్రు' అని చెప్పారు. 'రేవంత్ సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్లలో తొమ్మిది నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములను



గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నరు.. అందుకే అక్కడి రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తిరగబడ్డరు. పేద, చిన్న, సన్నకారు రైతులకు చెందిన మూడు వేల ఎకరాల భూములను ఫార్మా విలేజీ కోసం తీసుకుంటామని సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వం కాగితాల మీద కాగితాలు కదుపుతుంటే అక్కడ ఉండే మన లంబాడా గిరిజనులు, బంజారా ఆడబిడ్డలు తిరుగుబాటు చేసింర్రు. భూముల కోసం అక్కడి రైతులు 9 నెలలుగా టెంట్ వేసుకుని ధర్నా చేస్తున్నరు' అని వివరించారు. వారితో మాట్లాడేందుకు ముఖ్యమంత్రికి 9 నెలలుగా సమయం దొరకడం లేదని విమర్శించారు. మానుకోటలో ధర్నా కోసం డీజీపీకి ఫోన్ చేస్తే 30 మంది రైతుల కోసం సంఘీభావంగా మానుకోటలో ధర్నా ఎందుకు అన్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ పేదలు, దళిత, గిరిజన, బలహీన అన్నదమ్ములున్నారో వారందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

# విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు కృషిచేస్తా

## తన వంతు సలహాలు, సహకారం అందిస్తా..

### ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

### సీఎం చంద్రబాబుతో చాగంటి కోటేశ్వరరావు భేటి

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు భేటి అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతలో నైతిక విలువలు పెంచేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు చాగంటికి సూచించారు. భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో ప్రవచనాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో మంచిని పెంచే ప్రయత్నం చేయొచ్చని సీఎం అన్నారు. అంతేకాక..మంచి చదువు, ఉద్యోగం, భవిష్యత్?తో పాటు నైతిక విలువలు కూడా అవసరమని, అప్పుడే మంచి సమాజం ఆవిష్కృతం అవుతుందని ఆ దిశగా అందరూ కృషి చేయాలని అన్నారు. ప్రపంచంలో మరే దేశానికి లేని ఉన్నతమైన సంస్కృతి, సాంప్రదాయాలు మన సొంతం అని, వాటిని ఈ తరానికి, భవిష్యత్ తరాలకు అందించాలని చంద్రబాబు అన్నారు. మహిళలను గౌరవించడం, పెద్దలు, తల్లితండ్రుల మాటలకు విలువ ఇవ్వడం వంటివి యువతకు నేర్పించాలన్నారు. మారుతున్న కాలంలో అనేక అంశాలు విద్యార్థులు, యువతపై దుష్ప్రభావం చూపుతున్నాయని నైతిక విలువల పతనానికి ఇవి కారణం అవుతున్నాయని అన్నారు.మరోవైపు చాగంటి కోటేశ్వరరావు ఈరోజు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని నివాసంలో లోకేశ్?తో సమావేశం అయ్యారు. విద్యార్థుల్లో మహిళలు, పెద్దలు, గురువులపై గౌరవం పెంపొందించేలా ప్రత్యేకంగా పాఠ్యాంశాలు రూపొందించాలని దీని కోసం అమూల్యమైన సలహాలు అవసరమని చాగంటికి లోకేశ్? చెప్పారు. అయితే విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు తన వంతు సలహాలు, సహకారం అందిస్తానని ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. కాగా, చాగంటి కోటేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైతిక విలువల సలహాదారుగా ఇటీవల నియమించిన విషయం తెలిసిందే.....

# లగచర్ల ఘటనలో అమాయకులను జైల్లో పెట్టారు

## కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలి

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** లగచర్ల ఘటనలో అమాయకులను జైలులో పెట్టారని, కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సంగారెడ్డి జిల్లా కంది జైలులో లగచర్ల బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బక్కి వెంకటయ్య మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి గ్రౌండ్ లెవల్ రిపోర్టు ఇస్తామని చెప్పారు. లగచర్ల, రొటిబండ తండాలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం పర్యటించిందని, ఇప్పటికీ గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారన్నారు. కలెక్టర్‌పై దాడి ఘటన దురదృష్టకరమని, కానీ అమాయకులను జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించారని, అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి దాడులు చేసి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇది ఎస్సీ, ఎస్సీ యాక్టుకు విరుద్ధమన్నారు. అట్రాసిటీ కేసులపై స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జగన్, దుర్గాప్రసాద్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్‌కి గురైన విద్యార్థిని శైలజ మృతి

## గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

## రేవంత్ సర్కార్ నిర్లక్ష్యానికి బలైన విద్యార్థిని

## మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ.. విద్యార్థికి కన్నీటి నివాళి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన అశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కి గురై గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మృతి ) చెందింది. అక్టోబర్ 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. రిలో ఇద్దరు కోలుగా శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు 20 రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాత పడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువు ల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకుల పాఠశాలలు అధ్వాన్నంగా మారి విద్యార్థులు చనిపోతున్నారని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి బలైపోయిన వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. మీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతదన్నారు. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్ మీద అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.శైలజ తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చిందు సీఎం రేవంత్ రెడ్డి. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. విషాహారం వల్ల కన్నుమూయటం కలిచి వేస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకులంలో నాణ్యత లేని భోజనం పెట్టడం పాపం కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడం మరొక పాపం. అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. నిమ్స్ ఆసుపత్రిలో బిడ్డను పట్టుకొని అక్కడే ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంలోనూ కాంగ్రెస్ సర్కార్ పూర్తి వైఫల్యం చెందింది. చివరకు ఆ అమ్మాయి చావును కూడా దాచి పెట్టాలనే ఉద్దేశంతో, దొంగ చాటున మృతదేహాన్ని తరలిస్తుండడం సిగ్గుచేటు. గిరిజన విద్యార్థినీ కుటుంబానికి బాధ్యత వహించి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత

## ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పెరిగిన చలి తీవ్రత

## పలుచోట్ల 10 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ చలి తీవ్రత బాగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదు అవుతున్నట్టు తెలుస్తోంది. ఏపీలో వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని అంటున్నారు. హైదరాబాద్‌లో కూడా చలి పిడుగు భయపెడుతోంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండూ దారుణంగా పడిపోయాయి. రాత్రి చలి వణికిస్తుంటే ఉదయం పొగమంచు మరింత భయపెడుతోంది. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. చలి, పొగమంచు కారణంగా కాలుష్య తీవ్రత కూడా హైదరాబాద్‌లో విపరీతంగా పెరిగిపోయింది. కాగా తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షావరణం ఉంటే తెలంగాణలో మాత్రం ఎముకలు కొరికే చలి ఇబ్బంది పెడుతోంది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం చలి తీవ్రత పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనుంది. అనంతరం ఇది వాయవ్య దిశగా కదులుతుంది. తమిళనాడు శ్రీలంక తీరం వైపునకు వెళ్లి అక్కడ మరింత బలపడబోతోంది. ప్రస్తుత అల్పపీడన ప్రభావం కొంత వరకు కోస్తా ఆంధ్రపై కనిపిస్తోంది. ఆకాశం మబ్బులు పట్టి ఉంది. ఇది వాయుగుండంగా మారితే బుధవారం నుంచి శనివారం వరకు వివిధి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. శ్రీలంక సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్న అల్పపీడనం దక్షిణ కోస్తాపై ప్రభావం చూపబోతోంది. ఈ సాయంత్రం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తాతోపాటు రాయలసీమపై కూడా ప్రభావం ఉంటుంది. వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉంది. వర్షాలతోపాటు బలమైన గాలులు కూడా వీస్తాయి. దీంతో చలి తీవ్రత మరింతగా పెరగొచ్చు. సముద్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు కారణంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. నాలుగు రోజుల పాటు సముద్రంపై అల్పపీడన ప్రభావం తీవ్రంగా ఉంటుందని అందుకే జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. రైతులు కూడా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

# నారాయణపేట జిల్లాలో పింఛన్ కోసం రోడ్డెక్కిన వృద్ధులు

**నారాయణపేట,(క్రైమ్ మిర్రర్):** పింఛన్ కోసం వృద్ధులు నిత్యం ఏదో ఒకచోట రోడ్డెక్కుతున్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో సోమవారం పింఛన్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు హయాంలో నెలనెలా సక్రమంగా పింఛన్ ఇచ్చేవారన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీస్‌లో డబ్బులు ఇచ్చేవారని, ఈ నెల 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదని మండిపడ్డారు. పోలీసులు వృద్ధుల వద్దకు చేరుకొని రెండ్రోజుల్లో పింఛన్ ఇచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

# ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ముమ్మర ఏర్పాట్లు

## కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి..

## తొలుత అందుబాటులోకి రానున్న మామునూరు ఎయిర్‌పోర్టు




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్‌లోని మామునూరు, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సీఎం రేవంత్ సర్కారు రెడీ అయ్యింది. ఇక కేంద్రంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్‌నాయుడు ఉండడంతో అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే ఛాన్స్ ఉంది. అయితే హైదరాబాద్ తర్వాత తెలంగాణలోనే అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఉన్న మామునూరులో తొలుత ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. తొలి విడతలో మామునూరు ఎయిర్‌పోర్టును చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. వరంగల్ మహానగరం మాస్టర్ ప్లాన్ తయారీకి ఇప్పటికే ఆమోదం లభించింది. మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి ప్రక్రియను 2025 డిసెంబరుకల్లా పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు టార్గెట్‌గా పెట్టుకుంది. ఆ తర్వాత 2027 సంవత్సరం నాటికి రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా మామునూరు ఎయిర్ పోర్టును డెవలప్ చేస్తారు. వాస్తవానికి నిజాం నవాబు పాలనా కాలంలో మామునూరులో ఎయిర్ పోర్టు ఉండేది. దీనికి ఇప్పటికే 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్ పోర్టు కోసం అదనంగా మరో 253 ఎకరాలను సేకరించేందుకు తెలంగాణ సర్కారు రూ.205 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. రాబోయే నాలుగేళ్లలో భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు కూడా అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం మూడు మండలాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో భూసేకరణపై ఓ అంచనాకు వచ్చారు. రామగుండం పట్టణం సమీపంలో ఉన్న బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయిర్‌పోర్టు ఉండేది. బీకే బిర్లా తమ సిమెంట్ పరిశ్రమ సమావేశాలకు రావడానికి దీన్ని అప్పట్లో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కారు యోచిస్తోంది. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు దాదాపు 1,592 ఎకరాల్లో భూమి రెడీగా ఉందని తెలుస్తోంది. అయితే ఈ మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి అనుమతులను పొందాల్సి ఉంది.

# రాష్ట్రంలో అంబర్- రెసోజెట్ భాగస్వామ్య సంస్థ పెట్టుబడులు

## రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు

## సంస్థ రాకతో వెయ్యి ఉద్యోగాలు లభించే అవకాశం

## ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

## ప్రభుత్వ పరంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న మంత్రి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో మరో కంపెనీ పెట్టుబడులకు సిద్ధమైంది. పెట్టుబడులతో పాటు మరో వెయ్యి మందికి ఉపాధి కలగనుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినియమ వస్తువులు, విడి భాగాలు అందించే అంబర్-రెసోజెట్ భాగస్వామ్య సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చనట్లు మంత్రి తెలిపారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడిభాగాలు అందించే 'అంబర్- రెసోజెట్ భాగస్వామ్య సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. సోమవారం నాడు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. అంబర్-రెసోజెట్ సంస్థకు ప్రభుత్వ పరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సంస్థ దేశంలోని పలు కంపెనీల కోసం రూమ్ ఏసీలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్ల లాంటి పలు పరికరాలకు ఉత్పత్తి చేసి అందిస్తోందని ఆయన తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు చెప్పారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పిసిబి) ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వందేభారత్ రైళ్లు, మెట్రో రైళ్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలతో పాటు, బస్సులు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు ఎయిర్ కండిషనర్ల తయారీలో అంబర్ ఎంటర్ ప్రైజెస్ కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్ ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ డా. ఇ. విష్ణువర్ధన్ రెడ్డి, సిఇఓ మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా. ఎస్ కె శర్మ, అంబర్, రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కామారెడ్డి డెయిరీ కాలేజీకి తోడ్పాటు

## ప్రభుత్వ డైరీ టెక్నాలజీ కళాశాలకు బాసట

## రూ. 4 కోట్ల విరాళం ఇచ్చిన దొడ్ల డైరీ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పీవీ నరసింహ రావు తెలంగాణా పశువైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాల అభివృద్ధికి దొడ్ల డైరీ యాజమాన్యం రూ. 4 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన దొడ్ల డైరీ బోర్డు ఆమోద పత్రాన్ని సంస్థ ప్రతినిధి బీ.వీ.కే. రెడ్డి విశ్వవిద్యాలయ ఉప కులపతి అయిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యాసాచి ఘోష్‌కు సోమవారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అందించారు. ఈ విరాళం ద్వారా కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాల భవన మొదటి అంతస్తు నిర్మాణం, ఎన్ హెచ్ 44 నుండి కళాశాల వరకు సిమెంట్ రోడ్ నిర్మాణం, కళాశాల నుండి బాలుర , బాలికల వసతి గృహాల వరకు సిమెంట్ రోడ్ నిర్మాణం, కళాశాల భవనానికి మరమ్మత్తులు, రంగులు వెయ్యటం కళాశాల ప్రాంగణం లో సుందరీకరణ, మినీ డైరీ ఎ÷-లాంట్ ఏర్పాటు , ఇతర అవసరమైన పరికారాలను ఏర్పాటు చేస్తామని అఇక్ష శ్రీ బీ. వీ, కే రెడ్డి తెలిపారు. ఈ పనులకు సంబంధించిన వివరాలను తెప్పించుకొని కావలసిన విశ్వ విద్యాలయ ఆమోదాన్ని ఇవ్వవలసిందిగా ఉప కులపతి శ్రీ సబ్యాసాచి ఘోష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. శరత్ చంద్రను ఆదేశించారు . ఈ సందర్భం గా విశ్వవిద్యాలయ ఉప కులపతి శ్రీ సబ్యాసాచి ఘోష్, మాట్లాడుతూ కళశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన దొడ్ల డైరీ యాజమాన్యం ను, చైర్మన్ శ్రీ సునీల్ రెడ్డి,సంస్థ బి .వీ. కే రెడ్డి లను అభినందించారు. ఈ వసతుల కల్పనతో రాబోయే కాలంలో కళాశాలలో కోర్సును ప్రారంభించే అవకాశం ఉంటుందని విద్యా ప్రమాణాలు మెరుగుపడి విద్యార్థుల నైపుణ్యము కూడా పెరుగుతుందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ తెలిపారు.

# అర్ధరాత్రి శ్మశానంలో కోడిని బలిచ్చిన అఘోరీ

## కేసు నమోదు చేసిన వరంగల్ పోలీసులు

**వరంగల్,(క్రైమ్ మిర్రర్):** నాగసాధు అఘోరీ .. ఈ పేరు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో మార్మోగుతోంది. తన వికృత చేష్టలతో అటు మీడియా, ఇటు సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేసింది. తాజాగా, అఘోరీ ఊహించని వివాదంలో చిక్కుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడిని చంపినందుకు గానూ ఆమెపై కేసు నమోదైంది. ఈ నెల 19వ తేదీన వరంగల్ నగర శివారులోని బెస్తంచెరువు శ్మశాన వాటికలో పూజలు చేసిన అఘోరి వికృత చేష్టలకు పాల్పడింది. రెండు రోజులు శ్మశానంలో విడిది చేసి అక్కడ విచిత్ర పూజలు చేసి బహిరంగంగానే కోడిని బలిచ్చింది. ఇది చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అయ్యింది. శ్మశానంలో కోడిని బలివ్వడంపై కరీంనగర్ జిల్లాకు చెందిన జంతు ప్రేమికులు, లా విద్యార్థులు కసిరెడ్డి రోహన్ రెడ్డి, సౌమిత్ పటేల్‌లు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మామునూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వీడియోలను పోలీసులకు సమర్పించారు. బహిరంగంగా కోడిని బలిచ్చి రక్తార్పణ చేయడం నేరమని.. కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అఘోరీపై సెక్షన్ 325 కింద కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు అఘోరికి ఎఫ్ఐఆర్ అందజేయడంతో పాటు స్టేషన్ బెయిల్ మంజూరు చేయరని పిటిషనర్ రోహన్ రెడ్డి తెలిపారు. రెండు నెలల్లోపు ఛార్జ్ షీట్ నమోదు చేస్తారని చెప్పారు.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ గోవాన్ క్లాసిక్ 350 లాంచ్.. అదిరిపోయే లుక్, ఫీచర్లు



అదిరిపోయే లుక్‌తో రాయల్ ఎన్‌ఫీల్డ్ మరో కొత్త బైక్ 'రాయల్ ఎన్‌ఫీల్డ్ గోవాన్ క్లాసిక్ 350'ను ను లాంచ్ చేసింది. అలనాటి బాబర్ మోటార్‌సైకిల్ శైలిలో ప్రముఖ క్లాసిక్ 350 మోడల్‌కు అప్‌డేట్ ఫీచర్లతో గోవాలో జరిగిన మోటోవెర్స్ 2024 ఈవెంట్‌లో ఈ బైక్‌ను కంపెనీ ఆవిష్కరించింది.రాయల్ ఎన్‌ఫీల్డ్ గోవాన్ క్లాసిక్ 350 మోటార్‌సైకిల్ సింగిల్-టోన్ వేరియంట్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 2.35 లక్షలు కాగా డ్యూయల్-టోన్ మోడల్ ధర రూ. 2.38 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. ఈ మోటార్‌సైకిల్ రేవ్ రెడ్, ట్రిప్ టీల్, పర్పుల్ హేజ్, షాక్ బ్లాక్ అనే నాలుగు కలర్ స్కీమ్‌లలో లభిస్తుంది.కొత్త గోవాన్ క్లాసిక్ 350 ఇప్పటికే ఉన్న క్లాసిక్ 350 మోడల్‌కు సరికొత్త రూపంగా ఉంటుంది. బాబర్ తరహాలో విలక్షణంగా దీన్ని లుక్‌ను తీర్చిదిద్దారు. దీంట్లో చేసిన ముఖ్యమైన అప్‌గ్రేడ్‌ల విషయానికి వస్తే ఏప్ హ్యాంగర్ హ్యాండిల్‌బార్లు, ఫార్వర్డ్-సెట్ ఫుట్‌పెగ్‌లు, స్లాష్-కట్ ఎగ్జాస్ట్ పైపు వంటివి ఉన్నాయి.క్లాసిక్ 350 లాగే గోవాన్ క్లాసిక్ 350 కూడా అదే 349సీసీ జె-సిరీస్ ఇంజన్‌తో వస్తుంది.

# నగరాల్లో కిరాణా షాపులు ఇక కనిపించవా?

### క్విక్‌కామర్స్ జోరుతో తగ్గుతున్న విక్రయాలు.. ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలపైనా ప్రభావం

**దిల్లీ: ఇంట్లో ఏ చిన్న వస్తువు అవసరం పడినా, వీధి చివరన ఉండే కిరాణా షాపులకు వెళ్లడం పరిపాటి. అయితే రాబోయే రోజుల్లో నగరాల్లో కిరాణా షాపులను వెతుక్కోవాల్సిన పరిస్థితి రావొచ్చు. గత దశాబ్దకాలంగా భారత రిటెయిల్ రంగానికి కీలకంగా ఉన్న ఈ దుకాణాలు ఇప్పుడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. క్విక్‌కామర్స్ సంస్థలు వేగంగా విస్తరిస్తుండటంతో దాదాపు 2 లక్షల కిరాణా దుకాణాలు మూతపడ్డాయని వర్తక పరిశ్రమ చెబుతోంది. ఆర్డరు చేసిన 10 నిమిషాల్లోనే ఇంటి వద్దకే సరుకులు తీసుకొస్తుండటంతో క్విక్ కామర్స్ సంస్థలకు మంచి ఆదరణ లభిస్తోంది. కొత్తగా వస్తున్న సంస్థలు ఆఫర్లు ఇస్తుండటం, శ్రమ లేకుండా పని పూర్తవుతుండటం వల్ల వినియోగదారులు కూడా వీటికే మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా కిరాణా దుకాణాల్లో అమ్మకాలు తగ్గుతున్నాయని నిపుణులు వెల్లడిస్తున్నారు.**



### రూ.10,000 కోట్ల విక్రయాలు

ఒక్క ఈ ఏడాదిలోనే సంప్రదాయ కిరాణా దుకాణాల నుంచి రూ.10,700 కోట్ల(1.28 బి.డాలర్లు) విక్రయాలు క్విక్ కామర్స్ కంపెనీల చేతికి వెళ్లొచ్చని డేటమ్ ఇంటెలిజెన్స్ సంస్థ తెలిపింది. కిరాణా దుకాణాల్లో కొనుగోళ్లు తగ్గించామని 46% మంది క్విక్‌కామర్స్ వినియోగదారులు వెల్లడించారు. టాటా సంస్థ బిగ్‌బాస్కెట్, జొమాటోకు చెందిన బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, జియో మార్ట్ వంటి సంస్థలు నిమిషాల్లో ఉత్పత్తులను డెలివరీ చేస్తున్నాయి. క్విక్‌కామర్స్ వచ్చిన తర్వాత విక్రయాలు తగ్గాయని 67% మంది వర్తకులు పేర్కొన్నారు. కనీసం 25 శాతం కొనుగోళ్లను ఆన్‌లైన్ ద్వారా చేస్తున్నట్లు 82 శాతం మంది స్పష్టం చేశారు. 5% మంది ఇప్పటికే కిరాణా షాపుల్లో కొనుగోళ్లు ఆపేశామని అన్నారు. కిరాణా దుకాణాలతో పోలిస్తే ఆన్‌లైన్‌లో తమకు రాయితీలు, ప్రత్యేక ఆఫర్లు లభించాయని 66 శాతం మంది అభిప్రాయపడ్డారు.

#### వినియోగదారుల వ్యయాలు తగ్గాయ్

ఒక పక్క క్విక్ కామర్స్ సంస్థల సవాళ్లు ఉంటే, మరో పక్క ఇ-కామర్స్ విక్రయాలు, వినియోగదారుల వ్యయాలు తగ్గడం కిరాణా దుకాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీంతో సంప్రదాయ డిస్ట్రిబ్యూటర్‌లను కాపాడుకుంటూనే, వేగంగా వృద్ధి చెందుతున్న ఆన్‌లైన్ వ్యవస్థలను అందిపుచ్చుకోవడం డాబర్, మారికో, హెచ్‌యూఎల్, గోద్రేజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్ వంటి సంస్థలకు సవాలుగా మారింది.

#### నిల్వలు పలు మార్గాల్లో..

సాధారణ వాణిజ్య (జీటీ) నెట్‌వర్క్‌ల్లో బలహీనతలు నమోదవుతుండటంతో కంపెనీలు వాటి నిల్వలను తగ్గించుకునేందుకు పలు చర్యలు చేపడుతున్నాయి. జీటీ భాగస్వాములు సవాళ్లు ఎదుర్కొంటున్నారని, దీంతో లాభదాయకతపై ఒత్తిడి పడకుండా విక్రయాల కోసం ప్రత్యామ్నాయ మార్గాల వాటాను పెంచుకుంటున్నట్లు డాబర్ చెబుతోంది. క్విక్ కామర్స్ దూసుకెళుతుండటం స్టాకిస్ట్‌లను కూడా కలవరపెడుతోంది. అయితే క్విక్ కామర్స్ నిల్వ సామర్థ్యాలు తక్కువగా ఉండటం వల్ల స్టాకిస్ట్‌లను దాటిపోలేరని వ్యాపార వర్గాలు అంటున్నాయి. సాధారణ వాణిజ్యంతో పాటు ఆధునిక వాణిజ్యం, ఇ-కామర్స్ వంటి అధిక వృద్ధి విభాగాలపై కూడా దృష్టి పెట్టాలని హెచ్‌యూఎల్ భావిస్తోంది.

## ఐరన్ మ్యాన్ డ్రెస్‌లో మస్క్



ప్రపంచ కుబేరుడు 'ఇలాన్ మస్క్' తన ఎక్స్ ఖాతాలో ఒక ఫోటో షేర్ చేశారు. సోషల్ మీడియాలో ఈ చిత్రం తెగ వైరల్ అవుతోంది. ఇందులో మస్క్ ఐరన్ మ్యాన్ సూట్ వేసుకున్నట్లు చూడవచ్చు. ఐరన్ మ్యాన్ సూట్ వేసుకున్న మస్క్ ఫోటో షేర్ చేస్తూ.. శత్రువులను ఓడించడానికి అని పేర్కొన్నారు. అంతే కాకుండా.. ఓహ్ మిమ్మల్ని మీరు జోకర్ అని పిలుచుకుంటున్నారా?.. అయితే జోక్ ఎందుకు జోక్ చెప్పడం లేదు.. ఇదెంత హాస్యాస్పదం అని కూడా అన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తూ.. కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కొందరు మస్క్‌ని తదుపరి ఐరన్ మ్యాన్‌గా ఊహించారు. మరికొందరు ఐరనీ మ్యాన్: మీమ్ వార్ త్వరలో థియేటర్‌లలోకి రానుంది అని కామెంట్ చేశారు. ఇంకొకరు కామెంట్ చేస్తూ నువ్వెప్పుడూ ఒక్క జోక్ కూడా చెప్పలేదు అని అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ గెలుపొందిన తరువాత.. మస్క్ సంపద భారీగా పెరిగింది. టెస్లా స్టాక్ కూడా ఏకంగా 40 శాతం పెరిగిందని, దీంతో ఆయన సంపద 70 బిలియన్ డాలర్లు పెరిగి.. మొత్తం మీద 340 బిలియన్ డాలర్లు దాటినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో కూడా మస్క్ షేర్ మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

## జాబ్ కోసం సెర్చ్ చేస్తున్నారు?.. ఇవి తెలుసుకోండి




టెక్నాలజీ విపరీతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. చాలా పనులు సులభమైపోతున్నాయి. సోషల్ మీడియాను ఉపయోగించుకుని చాలామంది ఉద్యోగార్థులు జాబ్స్ వెతుక్కుంటూ ఉంటారు. ఇక్కడ మోసపోవడానికి కూడా ఆస్కారాలు చాలానే ఉన్నాయి. కాబట్టి దీని నుంచి బయట పడటానికి కొన్ని టిప్స్ పాటించాల్సి ఉంటుంది. ఉద్యోగం వెతుక్కోవడం కోసం చాలామంది లింక్డ్‌ఇన్‌ను ఆశ్రయిస్తారు. ఇది జాబ్స్ సెర్చ్ చేసుకోవడానికి విశ్వసనీయమైన స్థలం అయినప్పటికీ.. కొంత మంది తప్పుడు ప్రకటనలతో మోసం చేసే అవకాశం ఉంది. కాబట్టి ఉద్యోగార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని.. లింక్డ్‌ఇన్ ఇండియా లీగల్ %ఙ% పబ్లిక్ పాలసీ హెడ్ 'అదితి ఝా' పేర్కొన్నారు. లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌లో ఇలాంటి మోసాలను నివారించడానికి మా బృందం పనిచేస్తోందని కూడా అన్నారు.

#### జాబ్ సెర్చ్ చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

ఉద్యోగం కోసం సెర్చ్ చేస్తున్న సమయంలో.. మీకు కనిపించే ఉద్యోగ పోస్టింగ్‌పై ధృవీకరణ బ్యాడ్జ్ అనేది ఉందా? లేదా? అని గమనించాలి. పోస్టర్ అధికారిక కంపెనీ పేజీతో అనుసంధానించి ఉంటే అలాంటి వాటిని ఎంచుకోవచ్చు. ఉద్యోగానికి సంబంధించిన ధృవీకరణ చాలా ముఖ్యమని గుర్తుంచుకోవాలి. మీరు ఒక ఉద్యోగాన్ని వెతుకుతున్న సమయంలో బ్యాంకింగ్ వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారం అడుగుతున్నారంటే.. అలాంటి వివరాలను చెప్పకపోవడమే ఉత్తమం.ఇంటర్వ్యూ కోసం ఎన్‌క్రిప్టెడ్ సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయమని అడగడం లేదా తక్కువ పనికి అధిక వేతనంతో ఉద్యోగాలను అందించడం వంటివి చెబితే అస్సలు నమ్మకూడదు. చట్టబద్ధమైన సంస్థలు ఎప్పుడూ ఇలాంటి విషయాలను చెప్పదని గుర్తుంచుకోవాలి. ఉద్యోగం కోసం ఎవరైనా మిమ్మల్ని డబ్బు డిమాండ్ చేస్తే.. క్రిప్టోకరెన్సీని, గిఫ్ట్ కార్డ్‌లను పంపమని లేదా పెట్టుబడి పెట్టమని అడగడం పట్ల జాగ్రత్తగా ఉండండి. జాబ్ ఇచ్చే కంపెనీలు మీ నుంచి డబ్బు ఆశించదు. కంపెనీల అధికారిక లింక్డ్‌ఇన్ పేజీలలో ఉద్యోగాలను వెతుక్కోవడం మంచిది. జాబ్ పోస్టర్‌లతో కంపెనీలు పోస్ట్ చేసిన ఉద్యోగాల కోసం ప్రత్యేకంగా సెర్చ్ చేయడానికి ఫిల్టర్ వంటివి ఎంచుకోవచ్చు. ఇది ఎంచుకుంటే.. వెరిఫికేషన్‌లతో కూడిన జాబ్‌లు మాత్రమే మీ శోధన ఫలితాల్లో కనిపిస్తాయి.

## దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.26,533 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఔట్..!

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి ఎన్నికవ్వడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెలలో ఇప్పటి వరకూ దేశీయ స్టాక్ మార్కె నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) రూ.26,533 కోట్ల విలువైన పెట్టుబడులు ఉపసంహరించారు. దేశీయ కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు అంతంతే ఉండటంతోపాటు చైనా మార్కెట్లలో పెట్టుబడుల దిశగా విదేశీ ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తున్నది. అక్టోబర్ నెలతో పోలిస్తే ఈ నెలలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు తక్కువగా రూ. 94,017 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించారు. ఓవరాల్‌గా ఇప్పటి వరకూ విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడులు నికరంగా రూ.19,940 బయటకు వెళ్లిపోయాయి.సెప్టెంబర్ నెలలో దేశీయ మార్కెట్లలో రూ.57,724 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు. గత ఏడాది కాలంలో ఇది తొమ్మిది నెలల గరిష్టం. ఈ నెల 22 నాటికి ఎఫ్ పీఐలు రూ.26,533 కోట్ల పెట్టుబడులు విత్ డ్రా చేస్తే గత నెలలో రూ.94,017 కోట్లుగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ విధాన నిర్ణయాలను బట్టి భవిష్యత్ పరిణామాలు ఉంటాయని విశ్లేషకులు చెప్పారు.







## జపనీస్ బైక్ కొనుగోలుపై రూ.1.14 లక్షల డిస్కౌంట్

జపనీస్ బైక్ తయారీ సంస్థ కవాసకి భారతీయ విఫణిలోని తన నింజా 'జెడ్‌ఎక్స్ 10ఆర్' బైక్ ధరను రూ. 1.14 లక్షలు తగ్గించింది. దీంతో ఈ బైక్ ధర 17.34 లక్షలకు చేరింది. కవాసకి నింజా జెడ్‌ఎక్స్-10ఆర్ 2025 ఎడిషన్ ప్రారంభ ధర సెప్టెంబర్‌లో రూ. 17.13 లక్షలు. మార్కెట్లో అడుగుపెట్టిన తరువాత.. ఈ బైక్ ధర కొద్దిసేపటికే రూ.18.50 లక్షలకు చేరింది. అయితే ప్రస్తుతం ఇయర్ ఎండ్ సమయంలో మంచి అమ్మకాలను పొందాలనే ఉద్దేశ్యంతో కంపెనీ ఈ భారీ డిస్కౌంట్స్ ప్రకటించినట్లు తెలుస్తోంది.నింజా జెడ్‌ఎక్స్-10ఆర్ బైక్ 998 సీసీ ఇన్‌లైన్ ఫోర్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజన్ పొందుతుంది. ఇది 13200 rpm వద్ద 203 hp పవర్, 11400 rpm వద్ద 114.9 Nm టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్.. బై-డైరెక్షనల్ క్విక్ షిఫ్టర్ వంటివి పొందుతుంది.బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన TFT కన్సోల్, మల్టిపుల్ రైడింగ్ మోడ్‌లు, క్రూయిజ్ కంట్రోల్, లాంచ్ కంట్రోల్, ఇంజిన్ బ్రేక్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి అనేక లేటెస్ట్ ఫీచర్స్ కలిగిన కవాసకి నింజా జెడ్‌ఎక్స్-10ఆర్.. ఇప్పుడు రూ. 1.14 లక్షల తగ్గుదలతో లభిస్తోంది.

## అంతర్జాతీయ సంస్థతో అరబిందో జట్టు




న్యూఢిల్లీ: శ్వాసకోశ సంబంధ ఔషధాల అభివృద్ధి, విక్రయానికై ఒక అంతర్జాతీయ ఫార్మా దిగ్గజంతో యూఎస్‌లోని తమ అనుబంధ కంపెనీ లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకుందని అరబిందో ఫార్మా తెలిపింది. దీని ప్రకారం ఇరు సంస్థలు కలిసి ఉత్పత్తులను వాణిజ్యీకరిస్తాయి. భాగస్వా మ్య కంపెనీకి చెందిన ప్లాంట్లలో తయారీ ఉంటుందని, మార్కెటింగ్ ఇరు సంస్థలు చేపడతాయని అరబిందో తెలిపింది. ఔషధ అభివృద్ధికి అయ్యే వ్యయాన్ని ఇరు కంపెనీలు సమపాళ్లలో పంచుకుంటాయి. ఈ ఔషధ అభివృద్ధి కాలంలో అరబిందో గరిష్టంగా 90 మిలియన్ డాలర్ల మేర ఖర్చు చేయనుంది. ప్రపంచ తయారీ హక్కులను భాగస్వామ్య కంపెనీ కలిగి ఉంటుంది.

# అమాయకులను జైల్లో పెట్టారు..!

**వారి విడుదలకు ప్రయత్నిస్తాం...**

**కర్కశత్వంగా పోలీసుల తీరు...**

**అధికారులపై దాడి సరైంది కాదు...**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ బక్కి వెంకటయ్య...**



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో అమాయకులను జైల్లో పెట్టారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం కమీషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లెల శంకర్, నీలాదేవి లతో కలిసి లగచర్లలో పర్యటించారు. అనంతరం ఘటనలో అరెస్టయిన 24 మందిని సంగారెడ్డి జైల్లో కలిశారు. అంతకుముందు గిరిజనులతో భేటి అయ్యి లగచర్ల, రోటిబండ తండాలో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ప్రజలతో మాట్లాడుతూ%ౖ% జరిగిన సంఘటన దూరదృష్టకరమని, తమ సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అధికారుల పై తిరగబడడం సరిఅయిన విధానం కాదని అన్నారు. సంఘటన జరిగిన పరిణామాల అనంతరం జరుగుతున్న విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సంఘటనలో లేని వారిని కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారని ప్రజలు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా%ౖ% ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పి దృష్టికి తీసుకు వెళ్తానని ఎవరు అధైర్య పడకూడదని భరోసా ఇచ్చారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ తమ హక్కుల కోసం పనిచేస్తుందని, మీ బాధలు, సమస్యలను కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే ప్రభుత్వం భూ సేకరణ చేపడుతుందని, బలవంతంగా భూసేకరణకు పూనుకోదని అన్నారు. మరోవైపు సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వెళ్లిన ఆయన అరెస్టు అయిన వారితో కూడా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ వెంకటయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి లగచర్ల కేసులో క్షేత్రస్థాయి పరిస్థితుల్ని వివరిస్తామన్నారు. "ఈ కేసులో అమాయకులను విడుదల చేయాలని సీఎంను కోరతాం. ఇప్పటికీ గ్రామస్థులు భయాందోళనలో ఉన్నారు. కలెక్టర్‌పై దాడి ఘటనలో అమాయకులను జైల్లో పెట్టారు. లగచర్ల ఘటనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. కలెక్టర్‌పై దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటనను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం' అని అన్నారు. చైర్మన్ తో పాటు ఎస్సి వెల్ఫేర్ అధికారి మల్లేశం, సంబంధిత అధికారులు ఉన్నారు.

## 67925: పిట్లంలో ప్రజావాణి కి రెండు దరఖాస్తులు: తహసీల్దార్ వేణుగోపాల్



**పిట్లం క్రైమ్ మిర్రర్ న్యూస్ :** కామారెడ్డి జిల్లా పిట్లం మండల తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు పిట్లం తాహసిల్దార్ వేణుగోపాల్ తెలిపారు. గోద్మేగాం సమీపంలో గల క్రషర్ మిషన్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కమలాకర్, ఆయా శాఖలకు చెందిన అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తాజ్పూర్ దేవాదాయ శాఖ కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



**భువనగిరి, నవంబర్25(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం లోని తాజ్పూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా మాజీ సర్పంచులు ఓరుగంటి నాగయ్య గౌడ్, బొమ్మరపు సురేష్ ఎన్నిక కాగా, అధ్యక్షులుగా ర్యాకల శ్రీనివాస్ .ఉపాధ్యక్షులుగా -వరుగంటి వేణు, పండుగ కిరణ్, బొమ్మారపు బాలరాజ్, ఓరుగంటి అఖిల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వరుగంటి రమేష్ గౌడ్, కోశాధికారి రాంపలి అరుణ్, గంజి సందీప్, సహాయ కార్యదర్శి వరుగంటి సుధీర్ గౌడ్ ,రాంపల్లి అనిల్ సలహాదారులు వరుగంటి కృష్ణ, రాంపల్లి అజయ్, బింగి పాండు, రాంపల్లి నాగరాజు, గుండ్లపల్లి భరత్, ఓరుగంటి సాయి, కొంపల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు. వీరు పార్టీలకు అతీతంగా గ్రామ దేవాలయాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎన్నికైన తాజ్ పూర్ దేవాదాయ శాఖ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ర్యాకల శ్రీనివాసుని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ కుంగ్ ఫు -కరాటే పోటీలలో జిల్లాకు 6 బంగారు పతకాలు...

**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 25 (క్రైమ్ మిర్రర్ ):** వరంగల్ కాజీపేట నందు జరిగిన జాతీయ స్థాయి కుంగ్ ఫు- కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో భద్రాద్రి కుంగ్ ఫు -కరాటే అకాడమీ ప్రధానకార్యదర్శి, కోచ్ నిహారిక వద్ద శిక్షణ పొందుతున్న జిల్లాకు చెందిన 10 మంది బాల బాలికలు జాతీయ స్థాయి కరాటే పోటీలలో పలు విభాగాల్లో జరిగిన పోటీలలో సత్తా చాటి 6 బంగారు పతకాలు గెలుపొందారు. అండర్-10: బాలుర 30 కేజీల కటాస్ విభాగం లోబి.భాను కృష్ణ బంగారు పతకం, అండర్ -10బాలిక విభాగం: 33 కేజీల. కటాస్ విభాగంలో ఎం.ఏ సనా బంగారు పతకం , అండర్-12: బాలుర 36కేజీల కటాస్ విభాగంలో ఏ.జస్వంత్ బంగారు పతకం, అండర్-12: బాలుర 40 కేజీల కటాస్ విభాగంలో ఎం.ఏ.అయాన్ బంగారు పతకం,అండర్-14 : బాలుర 42కేజీల కటాస్ విభాగము ఎల్ .హర్షిత్ కుమార్ బంగారు పతకం, అండర్ 14 బాలికల 52కేజీల కటాస్ విభాగంలో ఏ.ఆశ్రిత బంగారు పతకం గెలుపొందారు. వీరు గతంలో కూడా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో అనేక బహుమతులు ,పతకాలు గెలుపొందారు. జాతీయస్థాయి కరాటే పోటీలలో పతకాలు గెలుపొందిన బాల బాలికలను సీనియర్ కరాటే మాస్టర్, మాజీ అంతర్జాతీయ కరాటే క్రీడాకారుడు పి.కాశీ హుస్సేన్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.యుగంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.రాజేంద్రప్రసాద్, చైర్మన్ కే.మహిధర్ మరియు అసోసియేషన్ సభ్యులు అభినందించారు.






## కారు ఢీకొని చిన్నారి మృతి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** కాలనీ రోడ్డుపై ఆడుకుంటున్న రెండేళ్ల చిన్నారిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మీర్పేట్ సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం భూపేష్ గుప్తా నగర్లో నివాసం ఉండే చిన్న తిరుపతయ్య కుమార్తె తిరుమల బాలమ్మ తోటి పిల్లలతో ఇంటిముందు ఆడుకుంటున్న సమయంలో %ూా 20 ా=% 6311 నెంబర్ గల మారుతి షిఫ్ట్ ను అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఆడుకుంటున్న తిరుమల బాలమ్మ అను పాపను ఢీకొట్టడంతో తలకి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆక్సిడెంట్ లో చనిపోయిన తిరుమల బాలమ్మ ను ఉస్మానియా హాస్పిటల్ మార్చురీకి తరలించి, ఆక్సిడెంట్ కి కారణం అయిన వాహనాన్ని యజమానిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నామని ఒక ప్రకటనలో తెలియజేశారు.

## పేదలకు చేయూతనిస్తా

**పేద మహిళ చికిత్స కోసం రూ.20వేల చెక్కు అందజేత**

**భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి సేవలను కొనియాడిన స్థానికులు**



**నారాయణపేట, క్రైమ్ మిర్రర్:** ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిచ్చేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కే.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా నారాయణపేట బీసీ కాలనీకి చెందిన సల్ల మానిగప్ప-మాసమ్మ దంపతులు. గత కొంతకాలంగా మాసమ్మ మానసిక స్థితి బాగాలేదు. ఇటీవల మాసమ్మ ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. కాలిన గాయాలతో ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మాసమ్మకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాసమ్మది పేద కుటుంబం కావడంతో సహాయం చేయాలని కోరుతూ ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక నారాయణపేట జిల్లా అధ్యక్షులు సల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కే.రాజ్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. మాసమ్మ ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితిని రాజ్ కుమార్ రెడ్డి తెలుసుకున్నారు. మాసమ్మకు మెరుగైన చికిత్స చేయించేందుకు గాను రూ.20వేల చెక్కును రాజ్ కుమార్ రెడ్డి అందజేశారు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కటిక పేదరికంతో బాధపడుతున్న మాసమ్మ మానసిక స్థితి బాగాలేని కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలుసుకొని ఆమెకు మెరుగైన చికిత్స కోసం రూ.20 వేలను అందజేయడం జరిగిందని తెలిపారు.

**రాజ్ కుమార్ రెడ్డి సేవలు అభినందనలు: సల్ల వెంకటేష్**

పేదలను ఆదుకునేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజకుమార్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక నారాయణపేట జిల్లా అధ్యక్షులు సల్ల వెంకటేష్ కొనియాడారు. తమ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేదలకు చేయూతనిచ్చి ఆర్థికంగా ఆదుకున్నారని అన్నారు. మాసమ్మ మానసిక స్థితి, అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విషయాన్ని తెలియజేసిన వెంటనే మానవతా దృక్పథంతో మాసమ్మకు మెరుగైన వైద్యం కోసం రూ.20వేలను అందజేయడం సంతోషకరమని అన్నారు. రాజ్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని సేవలు చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానిగప్ప, తిప్పన్న, బాలాజీ, సుదర్శన్ రెడ్డి, హన్మంతు, సంతోష్, శివరాజ్, రాజు, ముగ్గు గోవింద్, రవి, సిరిగిరి వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.



## అబ్బయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన తుల్లూరి బ్రహ్మయ్య

**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 25 (క్రైమ్ మిర్రర్):** ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఊకె అబ్బయ్య అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని సోమవారం నాడు వారి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఒకసారి బూర్గంపాడు నియోజకవర్గానికి రెండుసార్లు ఇల్లందు నియోజకవర్గానికి శాసనసభ్యులుగా పనిచేసి రెండు నియోజకవర్గాల అభివృద్ధికి అబ్బయ్య అందించిన సేవలు మరువలేనివి అని అన్నారు. ముఖ్యంగా గిరిజనుల అభివృద్ధికై ఎనలేని సేవలందించిన గొప్ప నాయకుడని మూడు పర్యాయాలు శాసనసభ్యులుగా పని చేసినా కూడా తనకంటూ ఏమీ సంపాదించుకోకుండా ఈరోజు నిలువ నీడ లేకుండా ఉన్న వారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,డిసెంబర్ 25(క్రైమ్ మిర్రర్):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సి.ఐ.టి.యు. జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ తన దరఖాస్తులో లక్షెట్టిపేట మండలంలోని చెరువు ఎఫ్. టి. సి., బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన జూల రాజన్న తాను ధరణి పోర్టల్ లో చేసుకున్న దరఖాస్తును త్వరగా పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గాడిపెల్లి సుధాకర్ ఇందారం ఓపెన్ కాస్టులో ముంపునకు గురైన తన భూమికి సంబంధించి నష్టపరిహారం ఇప్పించాలని అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మల్లేశం తమ గ్రామానికి మిషన్ భగీరథ నీటి కొరకు పైప్ లైన్లు, నల్ల కనెక్షన్లు ఇచ్చారని, నీటిని అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాజీపేట మండలం గుల్లాపహాడ్ గ్రామానికి చెందిన కుంరం విజయలక్ష్మి తాను 2018లో ముత్యంపల్లి అంగన్వాడి కేంద్రం-1 కొరకు జరిగిన నియామకాలలో ఎంపిక అయ్యానని, ఈ విషయమై విచారణ జరిపి తనకు నియామక పత్రం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మొహమ్మద్ యూసఫ్ హుస్సేన్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మినీ డిస్నీల్యాండ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

మందమర్రి మండలం ఆదిల్పేట గ్రామానికి చెందిన గురుండ్ల గంగుబాయి తాను పత్తి పంటను సాగు చేయగా ఆన్ లైన్ లో వరి పంట అని నమోదు కావడంతో తాను పత్తిని విక్రయించలేకపోతున్నానని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి చెందిన వేల్పుల లింగక్క తనకు గ్రామ శివారులో భూమి ఉందని తనకు పంట రుణం, రైతుబంధు వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలో గర్మిళ్ల ప్రాంతానికి చెందిన బైరి భానుమతి తనకు గల భూమికి సంబంధించి నూతన పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూరు పట్టణంలోని వీధి కుమ్మరి బొగుడ ప్రాంతానికి చెందిన సర్వర్ ఉ న్నిసా బేగం ఈ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా తమ ఇల్లు మొత్తం కూలిపోయి ఇంటిలోని విలువైన సామాగ్రి పూర్తిగా ధ్వంసం అయిందని, తమకు నష్టపరిహారంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ పథకం క్రింద ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎంఆర్పిఎస్ భద్రాచలం మండలం మహిళా కమిటీ ఎన్నిక

**భద్రాచలం నవంబర్ 25 (క్రైమ్ మిర్రర్ ):** ఎంఆర్పిఎస్ ఎంఎస్పి జిల్లా నాయకుల ఆధ్వర్యంలో భద్రాచలం మండల నూతన కమిటీ ని నియమించారు. ఈ కమిటీలో అధ్యక్షులు గా :- గుండె సుహాసిని మాదిగ అధికార ప్రతినిధిగా వల్లిపాక సునీత మాదిగ,ఉపాధ్యాక్షులుగా చింతా భవాని మాదిగ, ప్రచారకర్యదర్శిగా వల్లే పాక జ్యోతి మాదిగ, కోశాధికారీ గా మంద నవీన మాదిగ, ప్రచార కార్యదర్శి గా మంద కుమారి మాదిగ, గౌరవ సలహదారులు గా వేల్పుల సూర్యవాణి, జిల్లా అధ్యక్షురాలు ఎంఎస్పి పార్టీ తేల్లం సమ్మక్క జిల్లా అధికార ప్రతినిధి మొత్తం 10 మందితో ఒక కొత్త కమిటీ ని ఎన్నుకోన్నారు. ఈ కమిటీ ఈసంపల్లి కృష్ణ మాదిగ అధ్యక్షతన కమిటీ ని ప్రకటించారు.

# రాజ్యాంగ రూపకల్పన ప్రాముఖ్యతను ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేయాలి



**మంచిర్యాల ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** భారత రాజ్యాంగ రూపకల్పన ప్రాముఖ్యతను ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేయాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. సోమవారం మంచిర్యాలలో సంఘం నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నవంబర్ 26 భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకొని ఆయన మాట్లాడారు.. భారత రాజ్యాంగ రూప కల్పనకు 299 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయగా,అందులో 15 మంది మహిళలకు చోటు దక్కడం విశేషం అన్నారు. దేశంలో స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం ,సమన్యాయం, ప్రజాస్వామ్యం పరిడవిల్లడానికి రెండేళ్ల 11 నెలల 18 రోజులపాటు శ్రమించిన అనంతరం అఖండ భారత్ కు లిఖిత రాజ్యాంగాన్ని అందించారన్నారు.1949 నవంబర్ 26న అప్పటి రాజ్యాంగ పరిషత్ దీనికి ఆమోదం తెలిపిందన్నారు. నేటి కాలం యువతకు రాజ్యాంగ దినోత్సవం అనేది ఉందని అసలేంత మందికి తెలుసు? అని అన్నారు.అందరికీ జనవరి 26 న గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటున్న రోజు మాత్రమే తెలుసని,నవంబర్ 26 ప్రత్యేకత, దాని వెనుక గల ప్రాముఖ్యత చాలా తక్కువ మందికి తెలుసు అని అన్నారు.అటువంటి వారికి ఈరోజు ప్రాముఖ్యతను తెలియజేయడానికి ప్రభుత్వాలు విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అడ్వకేట్ మారపాక మల్లేష్, ఆడెపు సురేందర్, నడిపెల్లి సునీల్ రావు, హనుమండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు తీర్పు బాధాకరం

## రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్



**హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్):** జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వం ఇచ్చిన భూముల కేటాయింపులను రద్దు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య పేర్కొన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలిచ్చే విషయంలో సుప్రీం కోర్టు మానవీయ కోణంలో ఆలోచించి తీర్పు ఇవ్వాల్సి ఉండేనని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాల వైఫల్యం, నిర్లక్ష్యం, తప్పుడు విధానాల కారణంగానే ఇలాంటి పరిణామాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు జర్నలిస్టులకు మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ఉందని, జర్నలిస్టులు అసంతృప్తి, ఆవేదనకు లోనవుతున్నారని తెలిపారు. జర్నలిస్టులు సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఐక్యతను ప్రదర్శించి జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా ప్రయత్నం చేయాలని సూచించారు. గతంలో ఇళ్ళ స్థలాలు పొందిన వాళ్లకు కాకుండా ఏళ్ల తరబడి స్థలాలు రాని వారికి వచ్చే విధంగా కమిటీ ప్రయత్నం చేయాలని, ప్రభుత్వం కూడా వెంటనే న్యాయ నిపుణులను సంప్రదించి భవిష్యత్తులో న్యాయపరమైన అడ్డంకులు రాకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయించాలని కోరారు.

# సగరులను బిసి 'ఎ' లోకి మార్చాలి: ఉప్పరి శేఖర్ సగర

## సగరుల జీవన స్థితిగతులను బీసీ కమిషన్ ముందు వివరించిన రాష్ట్ర సగర సంఘం



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** తెలంగాణలో సగరుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే బి.సి 'డి' నుంచి 'ఎ' లోకి మార్చడం తప్ప మరో మార్గం లేదని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ ఖైరతాబాద్ లోని బీసీ కమిషన్ కార్యాలయంలో తెలంగాణ బిసి కమిషన్ ముందు సగర సంఘం వాదనలను వినిపించారు. కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి లతో కలిసి రాష్ట్ర సంఘం నాయకులు సగరుల జీవన స్థితిగతులను స్పష్టంగా వివరించారు. 1986వ సంవత్సరంలో మురళీధర్ రావు కమిషన్ నివేదిక ఆధారంగా అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు చొరవ తీసుకొని సగరులను బీసీ 'ఎ' లోకి మారుస్తూ 166 జీవోను విడుదల చేశారని, అనంతరం కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో తాత్కాలికంగా జీవోను నిలుపుదల చేస్తూ బిసి ఎ లో రిజర్వేషన్ సంఖ్య పెంచి తిరిగి సదరు జీవోను అమలు చేయాలని కోర్టు ఆదేశించడం జరిగిందని వివరించారు. అనంతరం కొనసాగిన ప్రభుత్వాలు సగరులను తిరిగి బిసి-డి లోనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనాదిగా ఆర్థికంగా వెనుకబాటుకు లోనైన సగర కులాన్ని ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. ఆర్థికంగా రాజకీయంగా వెనుకబాటుకు లోను కావడంతో విద్యా, ఉపాధి అవకాశాలు కోల్పోవడం జరిగిందని వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ ఫలాలు, విద్యా, ఉద్యోగాలలో బీసీ 'డీ'లో ఉండడం కారణంగా ఎలాంటి అవకాశాలు రావడం లేదని తెలిపారు. జీవో 166 ను పునరుద్ధరించడం లేదా సగరులను బీసీ ఏలోకి మారుస్తూ ప్రత్యేక జీవోను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. కులవృత్తిపైనే 90 శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్న సగరులకు ఫెడరేషన్ కాకుండా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సదరు కార్పొరేషన్ కు సగరులనే పాలకమండలిగా నియమించాలని సూచించారు. నిర్మాణరంగ కార్మికులుగా ఉన్న సగరులకు గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 59 ని సవరణ చేస్తూ ప్రభుత్వ కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్ సంఖ్య పెంచుతూ మరో జీవోను విడుదల చేయాలని, 50 సంవత్సరాల పైబడిన నిర్మాణరంగ కార్మికులైన సగరులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సగరుల ఆది గురువైన శ్రీ భగీరథ మహర్షి విగ్రహాన్ని రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ప్రతిష్టించాలని, ఆర్థికంగా రాజకీయంగా వెనుకబాటుకు లోనైన సగరులను గుర్తించి నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి చైర్మన్ గా సగరున్నే నియమించాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, రాష్ట్ర యువజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శేఖర్ సగర, నల్గొండ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆలేటి శివప్రసాద్ సగర తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కటైన వియత్నాం అమ్మాయి చండూరు అబ్బాయి



**చండూరు,క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీకి చెందిన పాంపాటి భాస్కర్ శోభ దంపతుల కుమారుడు సందీప్ వియత్నాంకు చెందిన అమ్మాయిని సోమవారం వివాహం ఆడాడు. ఉద్యోగరీత్యా 2017లో వియత్నాం వెళ్లాడు. అక్కడ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేస్తూ అక్కడే హెూటల్స్ స్థాపించి వ్యాపారాన్ని మొదలుపెట్టాడు.ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వ ఉద్యోగం యూత్ మినిస్ట్రీ సెక్రటరీగా పనిచేస్తున్న అమ్మాయి నీనా పరిచయం కావడం పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసి పాంపాటి సందీప్ తో వివాహానికి ఇండియా వచ్చింది.చండూరు మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సోమవారం రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. చండూరు అబ్బాయి విదేశి అమ్మాయిని వివాహం చేసుకోవటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# మొట్టమొదటిసారి యాదవుల ప్రత్యేక సదర్ సమ్మేళనం

## మేకల శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో...కార్యక్ర మం

## పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ ,కర్ణాటక ఎమ్మెల్సీ నాగరాజు యాదవ్



**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్) :** యాదవులు దున్నపోతులతో యాదవ యువకుల కుస్తీలు దున్నలతో అద్భుత విన్యాసాలు మన రాష్ట్ర రాజధాని ఒక హైదరాబాదుకి ప్రత్యేక పండుగ వున్నా సదర్ మహోత్సవం పెద్ద పెల్లి పార్లమెంట్ రామగుండం నియోజకవర్గం గోదావరిఖని చివరస్తాలో శ్రీకృష్ణ యాదవ సంఘం. మేకల శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు ముఖ్య అతిథులుగా హాజరైన పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ ,కర్ణాటక ఎమ్మెల్సీ నాగరాజు యాదవ్ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం ఉత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సంధన వేణి మహేంద్రనాథ్ యాదవ్ ,గొర్రె కాపర్ లో సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ హాజరైయారు ,అనంతరం ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ యాదవుల ప్రత్యేక సదర్ మహోత్సవం అంగరంగ వైభవంగా అద్భుతంగా దున్నపోతు విన్యాసాలతో చిందులు వేసి సంబరాలు చేసుకోవడం జరిగింది మొట్టమొదటిసారి మాజీ ఎంపీ మందాడి అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు మందాడి అనిల్ కుమార్ యాదవ్ సారధ్యంలో గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50000 మందికి పైగా యాదవులతో పెద్ద ఎత్తున సదరు సమ్మేళన మహోత్సవం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో విజయవంతంగా జరిపి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకు విస్తరించేలా చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించడం జరిగింది యాదవుల ప్రత్యేక సదర్ మహోత్సవంలో యాదవలకు సదర్ పండుగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం జరిగిందని హర్షించదగ్గ విషయం అని అన్నారు ,వారికి తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం మరియు యాదవుల కుల సంఘాలు తరఫున మా ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు, అనంతరం ఎంపీ గడ్డం వంశీకృష్ణ కి కర్ణాటక ఎమ్మెల్సీ నాగరాజు కి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేంద్రనాథ్ యాదవ్ కి ఘనంగా సన్మానం చేయడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమంలో ఓదెల మల్లన్న టెంపుల్ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్ మాజీ కౌన్సిలర్ కాల్వ లింగస్వామి యాదవ్ మాజీ సర్పంచ్ దాసరపు సత్యనారాయణ యాదవ్ వెల్పుల నాగరాజు యాదవ్ మంతిని పర్వతాలు యాదవ్ సాగర్ యాదవ్ గొంగడి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు యాదన బోయిని రాజన్న యాదవ్ కావటి సతీష్ యాదవ్ బత్తిని లక్ష్మణ్ యాదవ్ లడ్డు యాదవ్ పొన్నం యాదవ్ గోపాలకృష్ణ యాదవ్ కాట వేణి మహేష్ యాదవ్ చంద్రమౌళి యాదవ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం

# (AIDRM% ) రెండవ జాతీయ మహాసభ..!





**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో దళిత హక్కుల పోరాట సమితి %ణవూూ% ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో జనవరి 5 6 7 తేదీలలో జరగనున్నది ఈ జాతీయ మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని జగిత్యాల జిల్లా %ూ×ుఖజ% కార్యాలయంలో జరిగిన దళిత హక్కుల పోరాట సమితి సమావేశానికి అధ్యక్షతన వహించిన మోనుగూరి హనుమంతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ సమావేశ అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు. దీన్ని ఉద్దేశించి దళిత హక్కుల పోరాట సమితి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు పూర్తి చేసుకున్న అట్టడుగు వర్గాలైన దళితుల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు దళితుల దరిచేరడం లేదు భారత రాజ్యాంగం ప్రతి మనిషికి ఓటు హక్కు కల్పించడం మహత్తరమైనది. సమన్యాయ కల్పనలో మన ప్రభుత్వాల కృషి లోపం కనిపిస్తున్నది తరతరాలుగా అణిచివేత అంటరానితనం,వివక్షత, దోపిడి, పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన దళితుల అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా దళిత సామాజిక న్యాయం కోసం విద్య, వైద్య,వ్యాపారాన్ని రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం దేశ సంపదలో దళితుల వాటా కోసం సమర శంఖారావం పూరించడానికి 2025 జనవరి 5 6 7 నా మోక్షగుండం విశ్వేశ్వరాయ భవన్ హైదరాబాదు నగరంలో జరుగుతాయని ప్రకటించారు.. ఈ జాతీయ మహాసభలు దళితుల సమస్యలు చర్చించి పరిష్కరించుకునేందుకు దోహదపడతాయని అన్నారు.. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోనుగూరి హనుమంత్, జిల్లా ఉపాధ్యక్షులు రాచర్ల సురేష్,జిల్లా సహాయ కార్యదర్శిరామిండ్ల రాంబాబు,జిల్లా నాయకులుశనిగారపు ప్రవీణ్, బొమ్మల పురుషోత్తం, బొల్లె లక్ష్మీరాజం, మోనుగూరి గంగా నర్సయ్య, చిలుముల మైసయ్య, గుండు నారాయణ, వెన్న మహేష్,డి.వి రాజు..తదితరులు పాల్గొన్నారు

# పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ళ కఠిన కారాగార శిక్ష

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించి, అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక దాడికి ప్రయత్నించిన సంఘటనకు సంబంధించి ఫోక్సో చట్టం కింద నిందితుడైన బాలాపూర్ ఉస్మాన్ నగర్ చెందిన మహమ్మద్ జియాన్ అలియాస్ మహమ్మద్ ఓమర్ తండ్రి యాకూబ్ అలీ అన్సారి వయసు 33 వృత్తి డ్రైవర్ అయినా నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 5000 రూపాయల జరినామా విధిస్తూ బాధితురాలికి నష్టపరిహారంగా లక్ష రూపాయలతో ఎల్బీనగర్ లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి సోమవారం నాడు తీర్పు వెలువరించారు.

# ప్రజలకు పోలీస్ శాఖను చేరువ చేయడమే లక్ష్యం

## అడిషనల్ ఎస్పీ రాములు నాయక్



**నల్గొండ, క్రైమ్ మిర్రర్::** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 25 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు జిల్లా అడిషనల్ ఎస్పీ రాములు నాయక్. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.

# శ్రీ సోమేశ్వరస్వామిని దర్శించుకున్న - పీలా

**అనకాపల్లి/ తుమ్మపాల నవంబర్ 25:** స్థానిక శ్రీ సోమేశ్వరస్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర అర్బన్ మరియు ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలమెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ .నేడు కార్తీక మాసం నాల్గొవ సోమవారం పర్వదినం సందర్బంగా తుమ్మపాల మేజర్ పంచాయతీలో శ్రీ సోమేశ్వర స్వామి వారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం భక్తులతో కలిసి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు

# రావిర్యాలలో ఇంత దారుణమా...?

## నాణ్యత పాటించాలని అడిగినందుకు డ్రైనేజి ని నిలిపివేసిన కంట్రాక్టర్

## ఐదు రోజులనుండి దుర్వాసనతో తీవ్రయిబ్బందులు పడుతున్న బస్తీ వాసులు

## డ్రైనేజి కట్టడానికి సిమెంట్,ఇసుక బదులు డస్ట్ ని వాడున్న కాంట్రాక్టర్

## కాంట్రాక్టర్ పై తగినచర్యలు తీసుకోవాలని బస్తీ వాసుల డిమాండ్

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో నూతన డ్రైనేజీ పనులు ప్రారంభించి నెల గడుస్తున్న కానీ పూర్తి చేయని కాంట్రాక్టర్,గత ఐదు రోజుల ముందు డ్రైనేజీ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కొంతమంది మనుషులను పెట్టి పనిచేయిస్తున్నాడు. ఇసుక, సిమెంట్ తో కట్టవలసిన డ్రైనేజిని సిమెంట్ డస్ట్ వేసి కట్టడంతో బస్తీ వాసులు అడ్డుకొని తుక్కుగూడ మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ కు సమాచారం అందించగా వెంటనే స్పందించి పనిని నిలియవేశాడు.ప్రజలకు ఎల్లప్పుడూ అవసరమయ్యే డ్రైనేజీ,రోడ్డు,ఇలాంటి పనుల్లో సరైన నాణ్యతను పాటించాలని ఆదేశించాడు, నాణ్యత పాటించకుండా ఎవరైనా డ్రైనేజీలు,రోడ్లు వేస్తే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని మున్సిపాలిటీ ప్రజలకు సూచించారు.





క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' నుంచి థర్డ్ సింగిల్



ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ మూవీ కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఆచార్య సినిమా వచ్చిన ఈ సినిమా డిజాస్టార్ అవ్వడంతో వారి ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న గేమ్‌ఛేంజర్‌పైనే ఉన్నాయి. తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను సంక్రాంతి? కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. అయితే మూవీ నుంచి ఇప్పటికే టీజర్‌తో పాటు రెండు పాటలను విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా థర్డ్ సింగిల్ అప్‌డేట్‌ను వెల్లడించారు మేకర్స్. ఈ మూవీలోని థర్డ్ సింగిల్‌ను నవంబర్ 28న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక ఈ మూవీలో కన్నడ నటుడు జయరాయ్, సునీల్, నవీన్ చంద్ర, శ్రీకాంత్, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్లర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# రాజకీయాల్లోనూ స్టార్ పవన్

## రానా షోలో నాని హాట్ కామెంట్స్

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై నటుడు నాని ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్‌కు మద్దతుగా నిలిచిన హీరోల్లో నాని (ఔజీనితి) ఒకరు. ఆయనకు మద్దతుగా పోస్ట్ పెట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. తాజాగా పవన్ గురించి రానా దగ్గుబాటి షోలో మాట్లాడారు. పవన్ సినిమాల్లోనే కాదు రాజకీయాల్లోనూ పవర్ స్టారే అని అన్నారు. 'సినిమాల్లో పవన్ కల్యాణ్ స్టార్‌గా ఎలా ఎదిగారో తెలిసిందే. అయితే రాజకీయాల్లోనూ ఆయన అదే స్థాయిలో ఎదిగారు. అక్కడ కూడా పవర్‌స్టార్ అని నిరూపించుకున్నారు. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చారు' అని నాని అన్నారు. కామెంట్స్‌పై రానా స్పందిస్తూ.. పవన్ చాలా కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. ఆయన నిజంగానే సూపర్‌స్టార్ అని రానా అన్నారు. రాజకీయాలు కూడా సినిమాల్లాగే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నానితోపాటు ప్రియాంక అరుల్ మోహన్ కూడా పాల్గొన్నారు. రానా ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలిచ్చారు. ఈ షో తొలి ఎపిసోడ్‌ను గోవాలో జరుగుతోన్న 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా 'ద రానా దగ్గుబాటి షో' పేరుతో ఓ టాక్ షో స్ట్రీమింగ్ కానుంది.




# నటలనలో అర్ధశతాబ్దం పూర్తి చేసుకున్న మోహన్ బాబు

## తొలినాళ్లలో ఒక్కపూట భోజనం కరువే అని భావోద్వేగం




మంచు మోహన్‌బాబు నటనా ప్రయాణంలో 50వ వసంతంలోకి అడుగు పెట్టారు. 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకుని వచ్చే ఏడాది నవంబరు 22 వరకూ ప్రతినెలా ఓ వేడుకని నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో మోహన్‌బాబు మాట్లాడుతూ భావోద్వేగంగా మాట్లాడారు. 'నా తల్లిదండ్రులు ఆశీస్సులు, నటనలో నాకు జన్మనిచ్చిన దాసరి నారాయణరావుగారి దీవెనలు నాపై ఎప్పుడూ ఉంటాయి. సీనియర్ ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు ఎప్పుడూ నన్ను వారి సొంత తమ్ముడిలా భావించారు. అన్నిటికంటే ముఖ్యంగా అభిమానుల ప్రేమాభిమానాలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. 1975 మార్చి వరకు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాను. భోజనం కూడా దొరక్క ఎన్నో రోజులు ఇబ్బందులు పడ్డాను. నేడు మీ అందరితో (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) కలిసి భోజనం చేయాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయమని విష్ణుని అడిగాను. 'మా' అధ్యక్షుడిగా విష్ణు ఎలా పనిచేస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాను. 'మా' బిల్డింగ్ ఆలస్యం అవుతుందేమో కానీ విష్ణు చెప్పిన మాటను కచ్చితంగా నెరవేరుస్తాడు. దేశమే గర్వించదగ్గ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు' అన్నారు. కులం కూడు పెట్టదని పెద్దలు చెబుతారు. నా కులం వాళ్లే నా సినిమా చూడమంటే ఒక్కడు చూడడు. నాకు అందరూ సమానమే. కులమతాలతో సంబంధం లేదు. అన్ని కులాలు ఒక్కటే. అందరూ నన్ను ఆశీర్వదించాలి. ఎన్నో మంచి పనులు చేశాను. వాటిని వేదికలపై చెప్పడం నాకు నచ్చదు. చనిపోయిన నటుడి భార్యకు ఉద్యోగం ఇప్పించాను. వాళ్ల పిల్లల్ని చదివించాను. ఆ పిల్లలు కూడా హీరోలు అయ్యారని విని సంతోషించాను. ఎంతో మంది పిల్లల్ని నేను చదివించాను. ఇలాంటి మంచి పనులు ఎప్పుడూ చేస్తూనే ఉంటాను. నా సినిమాల్లోనూ ఎంతోమందికి అవకాశాలు కల్పించాను. ఎవరికైనా చదువు విషయంలో ఇబ్బందులు ఉంటే నా యూనివర్సిటీ ఉందని మర్చిపోకండి' అన్నారు. ఇక కన్నప్ప చిత్రం గురించి చెబుతూ ఇది విష్ణు కెరీర్‌లో మైలు రాయి కావాలని కోరుకుంటున్నా' అన్నారు.





# నాగచైతన్య కొత్త సినిమా అనౌన్స్




స్టార్ హీరో అక్కినేని నాగచైతన్య కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు. సాయి ధరమ్ తేజ్‌కి విరుపాక్ష లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు కార్తీక్ వర్మ దర్శకత్వంలో చైతూ సినిమా చేయబోతున్నాడు. నాగ చైతన్య పుట్టినరోజు కానుకగా శనివారం ఈ ప్రాజెక్ట్‌ను ఆఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఎన్‌సీ24 అనే వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో కథానాయికగా పూజా హెగ్డేను తీసుకోబోతున్నారని టాక్ నడుస్తుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లపై బోగవల్లి ప్రసాద్‌తో పాటు సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మరోవైపు గతేడాది కస్టడీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చైతూ భారీ డిజాస్టర్‌ను అందుకున్నాడు. ఇక ప్రస్తుతం అతడి ఆశలన్ని తండేల్ చిత్రంపైనే ఉన్నాయి. కార్తికేయ 2 ఫేం చందూ మొండేటి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుండగా.. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రెహమాన్ బాటలోనే మోహిని డే విడాకులు

## రెహమాన్‌తో సంబంధంపై సర్వత్రా పుకార్లు

ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు, ఏ.ఆర్ రెహమాన్ సైరా బాను దంపతులు విడాకులు తీసుకోబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వీరిద్దరి విడాకులు ప్రకటించిన కాసేపటికే తన భర్త నుంచి విడిపోతున్నట్లు రెహమాన్ టీమ్‌లోని బాసిస్ట్ మోహిని డే వెల్లడించారు. గత కొన్నేళ్లుగా ఆమె రెహమన్ ట్రూప్‌లో కొనసాగుతున్నారు. అయితే రెహమాన్, మోహిని డే ఒకేరోజు విడాకులు ప్రకటించడంతో ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా ఈ రూమర్స్‌పై మోహిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించింది. నేను విడాకులు ప్రకటించిన అనంతరం నుంచి మీ ఇంటర్వ్యూ కావాలని నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అయితే వీళ్లంతా ఎందుకు ఇంటర్వ్యూ చేద్దాం అనుకుంటున్నారో నాకు తెలుసు. ఈ చెత్తకు ప్రచారమివ్వాలన్న ఆసక్తి నాకు ఏమాత్రం లేదు. ఇలాంటి రూమర్స్‌పై మాట్లాడి నా విలువైన సమయాన్ని వృథా చేసుకోలేను. దయచేసి నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి అంటూ మోహిని డే చెప్పుకోచ్చింది. మరోవైపు ఇదే విషయంపై రెహమాన్ భార్య సైరా తరఫు న్యాయవాది వందనా షా కూడా స్పందిస్తూ.. ఈ రూమర్స్‌లో ఎలాంటి నిజం లేదని క్లారిటీ ఇచ్చారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.